సాక్షి
వికారాబాద్
బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



'పది'కి ప్రత్యేక తరగతులు

పదో తరగతితో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. 8లో▸



అర్హులందరికీ పథకాలు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



సదస్సుల జాడేది?

అధికారులు రైతు చైతన్య సదస్సులు నిర్వహించకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

పారిశుద్ధ్యం పక్కాగా..

నేటి నుంచి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

- వారం పాటు కొనసాగనున్న పనులు
- చివరి రోజు అవార్డులు అందజేయనున్న అధికారులు
- పట్టణ, పల్లె ప్రగతి తరహాలో కార్యక్రమాలు



శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌పై దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం రూపొందించింది. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పేరుతో వారం రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. ఇప్పటికే పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఈ కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 7నుంచి 14వ తేదీ వరకు వారం రోజుల పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నారు. చివరి రోజు పనులు బాగా చేసిన వారిని గుర్తించి సన్మానించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేకాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల ఒకటవ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో వారి స్థానాల్లో ప్రత్యేకాధికారులను నియమించిన విషయం తెలిసిందే. పంచాయతీల్లో పారిశుద్ధ్యం లోపించరాదనే ఉద్దేశంతో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమం తరహాలోనే ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు.

నిధులపై స్పష్టత కరువు

వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ పేరుతో నిర్వహించాలని నిర్ణయించిన కార్యక్రమానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులేమీ కేటాయించలేదు. కొన్ని పనులకు నిధులు అవసరం ఉండటంతో స్పెషల్ ఆఫీసర్లకు దిక్కుతోచడం లేదు. నిధులు లేకుండా వారం రోజుల పాటు కార్యక్రమాల నిర్వహణ ఎలా అని ఆందోళనకు గురవుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే సర్పంచులు చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉండగా ఇప్పుడు ఈ కార్యక్రమాల డబ్బులు ఎక్కడి నుంచి ఖర్చు చేయాలని అనే ఆలోచనలో పడ్డారు అధికారులు. అయితే రెగ్యులర్ శానిటేషన్ కార్యక్రమమే అయినందున ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం లేదని ఉన్నతాధికారులు అంటున్నారు.

నిర్వహించే కార్యక్రమాలు ఇవే..

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పేరుతో వారం రోజుల పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రామీణ రోడ్లు, మురుగు కాలువలను శుభ్రం చేయడం. ఖాళీ, ప్రభుత్వ స్థలాల్లో, ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడం. వాటర్ ట్యాంకులు, ఇతర మంచినీటి వనరులను శుభ్రం చేయడం. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రు లు, అంగన్‌వాడీ సెంటర్లు, గ్రామ పంచాయ తీలు, ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచడం. నీళ్లు నిలిచే ప్రదేశాలను శుభ్రం చేయించడం. అలా గే గ్రామంలో పాడుబడిన బావులు, పాడు బడిన ఇళ్లను తొలగించడం వంటివి చేయించాల్సి ఉంటుంది.

అందరినీ భాగస్వాములు చేయాలి

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను అధికారులు చిత్తశుద్ధితో అమలు చేయాలి. ప్రతి గ్రామంలో వారం రోజుల పాటు పనులు చేయాలి. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు,ఆయా సంఘాలను భాగస్వాములను చేయాలి. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

– నారాయణరెడ్డి, కలెక్టర్



రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

రీసైక్లింగ్ చేస్తే క్రిమినల్ కేసులు

- సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి తరలించాలి
- వానాకాలం సీజన్‌లో 44వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం
- అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

వికారాబాద్ అర్బన్: సీఎంఆర్‌ను రీసైక్లింగ్ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో రైసు మిల్లర్లతో సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి తరలించే అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అట్టి ధాన్యాన్ని 27 మిల్లర్లకు తరలించినట్లు చెప్పారు. రైస్ మిల్లర్లు తమ మిల్లింగ్ సామర్థ్యం ప్రకారం ప్రతిరోజూ బియ్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిల్లర్లు 2023 – 24 సంవత్సరానికి సంబంధించిన బియ్యాన్ని వెంటనే డెలివరీ చేయాలని ఆదేశించారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు నిత్యం మిల్లుల్లో ధాన్యం నిల్వలను తనిఖీ చేస్తారని తెలిపారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, మేనేజర్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పలువురు ఎస్‌ఐల బదిలీ

అనంతగిరి: జిల్లా వ్యాప్తంగా పలువురు ఎస్‌ఐలను బదిలీ చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోమిన్‌పేట ఎస్‌ఐ విఠల్ రెడ్డిని కరణ్‌కోట్ పీఎస్‌కు, తాండూర్ ఎస్‌ఐ అరవింద్‌ను మోమిన్‌పేటకు, చెంగోముల ఎస్‌ఐ గిరెన్నను పెద్దేముల్‌కు, కరణ్‌కోట ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డిని చెంగోములకు, వెయిటింగ్‌లో ఉన్న రమేష్‌ను బషీరాబాద్‌కు, బషీరాబాద్ ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్‌ను ధారూరుకు, ధారూర్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌ను పరిగి పీఎస్‌కు, పరిగి, పెద్దేముల్ ఎస్‌ఐలు సత్యనారాయణ, కాశీనాథ్‌ను వెయిటింగ్‌లో ఉంచినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

వరి పంట పరిశీలన



దేశాయిపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

దౌల్తాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ వ్యవసాయ విద్యాలయం వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌బాబు, ఏరువాక కేంద్రం తాండూరు కోఆర్డినేటర్ లక్ష్మణ్, ఏఈఓ వైశాలి మండలంలోని దేశాయిపల్లిలో రైతుల పంటలను పరిశీలించారు. వరి పొలంలో మురుగునీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి సాగులో నాచును తొలగించిన తర్వాత 25కిలోల యూరియాకు స్ప్రింట్ 100 గ్రాములు కలిపి ఒక ఎకరాకు వేయాలని సూచించారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటును ఆపాలి

పూడూరు: మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటును ఆపాలని పూడూరుకు చెందిన పలువురు నాయకులు మంగళవారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుకు అనుమతులు ఇచ్చిందని, ఆ పనులు చేపడితే ఇక్కడి వాతావరణం కలుషితం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సెన్సార్ బోర్డ్ మెంబర్ మల్లేష్ పటేల్, దామగుండం సత్యానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



రికార్డులు పరిశీలిస్తున్న హబీబ్ అహ్మద్

కుల్కచర్ల: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు ఆసక్తిగల మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ తెలిపారు. మంగళవారం పాఠశాలను సందర్శించిన ఆయన పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

అన్ని వార్డుల్లో యూజీడీ పనులు

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



కొత్రెపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంజుల

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో యూజీడీ పనులు చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చైర్‌పర్సన్ మంజుల తెలిపారు. మంగళవారం 5వ వార్డు కొత్రెపల్లి, 16వ వార్డు గంగారంలో పలు అభివృద్ధి పనులను మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సుధాకర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కొత్రెపల్లిలో మురుగు కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. 16వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సూచన మేరకు ప్రతి వార్డులో పర్యటించి సమస్యలు గుర్తిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, కౌన్సిలర్లు ప్రవళిక, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం జరగదు

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి గ్రామ శివారులో నిర్మిస్తున్న పారిశ్రామిక వాడలో భూములు కోల్పోయిన రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో రైతులతో మాట్లాడారు. జినుగుర్తి గ్రామ సర్వే నంబర్ 206లో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చిందని చెప్పారు. పరిహారం అందని రైతుల వివరాలు ఆర్డీఓకి వివరించి వారి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. పారిశ్రామిక వాడ పనులు ఎవరూ ఆపరాదని సూచించారు.



పల్లెకు పోదాం రండి కార్యక్రమంలో భాగంగా అమీర్‌పేట్ గ్రామంలో పర్యటిస్తున్న కిషన్‌రెడ్డి, నాయకులు

మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి

- మరోసారి అధికారంలోకి రావడం ఖాయం
- కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మహేశ్వరం: దేశ ప్రజలు మరోసారి మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 'గావ్ చలో' (పల్లెకు పోదాం పదండి) కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండల పరిధిలోని అమీర్‌పేట్‌లో పర్యటించారు. కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకెళ్తోందని అన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 370 నుంచి 400 వరకు ఎంపీ సీట్లు గెలుపొంది మూడోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.500 ఏళ్ల రామ మందిర స్వప్నం మోదీతోనే సాకారమైందన్నారు. స్వచ్ఛభారత్‌తో 11 కోట్ల టాయిలెట్ల నిర్మాణం, జన్‌ధన్‌యోజన కింద 50 కోట్ల మందికి బ్యాంకు సేవ లు చేరవయ్యాయన్నారు. పేదలకు ఆసరాగా ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్, విశ్వకర్మ, గరీబ్ కళ్యాణ్ యోజన పథకాలను తీసుకొచ్చారన్నారు. తెలంగాణలో 40 లక్షల రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వా రా ఏడాదికి రూ.6 వేల సాయం అందించిందన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా 29 లక్షల కుటుంబాలకు ఆరోగ్య భరోసా లభించిందని తెలిపారు. రాష్ట్రంలో 18.75 లక్షల మంది మహిళలకు ఉజ్వల పథకం కింద లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు. కరోనా సమయంలో రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉచితంగా బియ్యం పంపిణీ చేశామని గుర్తు చేశారు. ఆవాస్‌యోజన కింద ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో మెజార్టీ ఎంపీ స్థానాలు గెలిచి మోదీకి కానుకగా ఇస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కేంద్రంలో మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కిషన్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తప్పుడు, అమలు కానీ హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేలా బీజేపీ ప్రజల పక్షాల కొట్లాడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ కార్యదర్శి బి.పాపయ్య గౌడ్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు తూళ్ల వీరేందర్ గౌడ్, వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ అనంతయ్య గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదిష్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అనిత తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్: రైతుల అభివృద్ధి, సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయం అని డీసీసీబీ చైర్మన్, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. ఆయన అధ్యక్షతన సంఘం కార్యాలయంలో మంగళవారం పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవంబర్ నుంచి జనవరి వరకు జమ, ఖర్చుల ఆమోదం, కొత్తగా సభ్యులను చేర్చుకోవడం, స్వల్పకాలిక, దీర్ఘకాలిక అప్పులు, పాత బకాయిదారులపై చట్టపరమైన చర్యలు, అప్పుల వసూలు గురించి చర్చించారు. అనంతరం ఇటీవల మరణించిన బ్రాహ్మణపల్లికి చెందిన రైతు సంరెడ్డి రంగారెడ్డి కుటుంబ సభ్యులకు రూ. 25వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవ రెడ్డి, కొండ్రు స్వప్న, చాపల యాదగిరి, లక్ష్మమ్మ, నర్సింగ్ రావు, కృష్ణారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, భార్గవి, సంఘం సెక్రటరీ వై.రాందాసు పాల్గొన్నారు.

అనుమతి చాటున అడ్డదారి

- ఖాంజాపూర్ వాగు నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు



ఖాంజాపూర్ వాగులో ఇసుక ట్రాక్టర్లు

తాండూరు రూరల్: ప్రభుత్వాలు మారినా ఇసుక అక్రమ దందా మాత్రం ఆగడం లేదు. పర్మిషన్ పేరుతో యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు.ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫిర్యాదు చేసినా స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.తాండూరు మండలం ఖాంజాపూర్ వాగు నుంచి రోజూ ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. మైనింగ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని పలు వురు ఆరోపిస్తున్నారు. ఒక్క ట్రాక్టర్ ఇసుక కావాలంటే సదరు వ్యక్తి ప్రభుత్వానికి రూ.600 విలువ చేసే డీడీ తీసి ఇవ్వాల్సి ఉంటుంది. ఇంటి నిర్మాణం చేపడుతున్న వ్యక్తి గ్రామ పంచాయతీ లేదా మున్సిపల్ కమిషనర్ నుంచి పర్మిషన్ తీసుకోవాలి. అయితే ట్రాక్టర్ యజమానులు సిండికేట్‌గా మారి ఇంటి యజ మాని పేరిట నకిలీ పత్రాలు సృష్టించి దందా సాగి స్తున్నారు. పర్మిషన్ ఒకచోట ఉంటే ఇసుక మాత్రం మరో చోట డంపింగ్ చేస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా తనిఖీలు చేయలేక పోతున్నామని రెవెన్యూ అధికారులు అంటున్నారు. కొంత మంది యజమానులు ట్రాక్టర్లకు నంబర్లు తొలగించి ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు.

అనుమతికి మించి రవాణా

ప్రభుత్వ నిబంధనల మేరకు రోజుకు ఒక ట్రాక్టర్ నాలుగు ట్రిప్పుల ఇసుకను మాత్రమే తరలించాలి. కానీ పది ట్రిప్పులకు పైగా తరలిస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ. 600 డీడీ చెల్లించి బయట మాత్రం రూ.3 వేలకు అమ్ముకుంటున్నారు.

సమయం దాటినా..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇసుక తరలించేందుకు అనుమతి ఉంటుంది.కానీ ట్రాక్టర్ యజమానులు మాత్రం ఉదయం 9 నుంచే ప్రారంభించి రాత్రి 7గంటలు దాటినా ఇసుకను తరలిస్తున్నారు. పోలీసులు నామమాత్రంగా తనిఖీలు చేసి అప్పుడప్పుడు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నారు.

పర్యవేక్షణ కరువు

ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ శాఖ అధికారుల పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నా సిబ్బంది లేరనే సాకుతో మిన్నకుండి పోతున్నారు. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు వాగు నుంచి యథేచ్ఛగా ఇసుక తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



పర్మిషన్ తీసుకున్న చోట మాత్రమే ఇసుకను డంపింగ్ చేయాలి. వేరే చోట డంపింగ్ చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇంటి నిర్మాణానికి సంబంధించి పత్రాలు ఉంటేనే ఇసుక రవాణాకు పర్మిషన్ ఇస్తాం.

– తారాసింగ్, తహసీల్దార్, తాండూరు

కేసులు నమోదు చేస్తాం

ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే అట్టి ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేస్తాం. సమయం దాటిన తర్వాత ఇసుక తరలించరాదు. ఇసుక రవాణా సమయంలో అనుమతి పత్రాలు తప్పని సరిగా ఉండాలి. సరైన పత్రాలు లేని మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నాం. ఇకపై కూడా తనిఖీలు నిర్వహిస్తాం.

– సంతోష్‌కుమార్, పట్టణ సీఐ, తాండూరు

పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలి

- ప్రత్యేకాధికారులకు కలెక్టర్ శశాంక సూచన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రత్యేకాధికారులు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ప్రత్యేకాధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 2వ తేదీ నుంచి బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారులు పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటునందించాలని అన్నారు. 2018 పంచాయతీరాజ్ చట్టంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బ్యాంకు అకౌంట్ గురించి, గ్రామంలోని ప్రత్యేక సమస్యలైన తాగునీరు, పారిశుద్ధ్యం, కోర్టు కేసులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రానున్న వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీరు ఎద్దడి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. లీకేజీ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు 100 రోజులు పని కల్పించాలని తెలిపారు. హరితహారం మొక్కలు పెంపకం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై వివరించారు. ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 15న పంచాయతీ ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేసి పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేయాలని సూచించారు. అధికారులు సరైన సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కాకూడదని, విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇన్‌చార్జి పంచాయతీ అధికారి సంధ్యారాణి, జిల్లా పరిషత్ సీఈఓ దిలీప్‌కుమార్, మిషన్‌భగీరథ ఎస్ఈ ఆంజనేయులు, ఎస్ఈ పీఆర్ రాజేశ్వర్, అడిషనల్ పీడీ నీరజ తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తులకు చేయూత

చేతి వృత్తులను గుర్తించి చేయూతనివ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. పీఎం విశ్వకర్మ పథకంపై కుల వృత్తుల సంఘాలకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కులవృత్తులకు శిక్షణ ఇవ్వడం ద్వారా తరతరాలుగా వస్తున్న కళా నైపుణ్యాలకు వన్నెలద్దడమే కాకుండా ఆర్థిక పరిపుష్టిని కలిగించినట్లవుతుందని తెలిపారు. ఈ పథకానికి 18రకాల కులవృత్తులు చేస్తున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గుర్తింపు కార్డు, ధ్రువీకరణ పత్రం ఇవ్వడంతోపాటు రూ.15వేల టూల్ కిట్‌ను ప్రోత్సాహకంగా అందిస్తామన్నారు. వడ్డీ రాయితీ, రుణసదుపాయంతో వ్యాపార అవకాశాలు పెంపొందుతాయన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ తేదీ నాటికి 18 నుంచి 60 సంవత్సరాల వయసు వరకు ఉండలన్నారు. గత ఐదేళ్లలో స్వయం ఉపాధి, వ్యాపార అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ రుణాలు తీసుకుని ఉండకూడదన్నారు. ముద్ర, స్వనిధి పథకాల లబ్ధిదారులు తమ రుణాలను చెల్లించినట్లయితే విశ్వకర్మ పథకానికి అర్హులన్నారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వర్తిస్తుందన్నారు. మండలాల్లో ఎంపీడీఓ, మున్సిపాలిటీల్లో కమిషనర్లు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించాలన్నారు. పథకం గురించి అధికారులకు ఇండస్ట్రీస్ జీఎం రాజేశ్వర్‌రెడ్డి వివరించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి, డీసీబీ అధికారి ధాత్రిదేవి, ఇన్‌చార్జి పంచాయతీ అధికారి సంధ్యారాణి, మెప్మాపీడీ శంకర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొలంలో పడి వ్యక్తి మృతి


జనార్దన్‌రెడ్డి(ఫైల్‌)

యాలాల: ప్రమాదవశాత్తు పొలం(కరిగెటు)లో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని జుంటుపల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్‌ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పెండ్యాల జనార్దన్‌రెడ్డి(46)కి గ్రామ శివారులో పదెకరాల పొలం ఉంది. ఎప్పటిలాగే సోమవారం ఉదయం పొలానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా రాత్రి 10 గంటల సమయంలో సాగు చేసేందుకు సిద్ధం చేసిన కరిగెటులో విగతజీవిగా బోర్లాపడి ఉండడాన్ని గుర్తించారు. విషయాన్ని యాలాల పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య శ్రావణితో ఇద్దరు కుమారులున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏపీఓపై సస్పెన్షన్‌ వేటు

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్‌


వెంకటేశ్‌ గౌడ్‌, ఏపీఓ

కుల్కచర్ల/పూడూరు: జిల్లా అధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలం కావడం.. నర్సరీలలో మొక్కలను ఏర్పాటు చేయకపోవడం కారణంగా కుల్కచర్ల ఏపీఓ వెంకటేశ్‌ గౌడ్‌ను సస్పెన్షన్‌ చేస్తున్నట్లు కలెక్టర్‌ సి.నారాయణ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఏడు రోజులలో సరైన కారణాలతో ఎంపీడీఓకు రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా 2024 జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా మొక్కలు ఏర్పాటు చేసేందుకు కుల్కచర్ల మండలానికి గాను 2,52,000 బ్యాగులలో మట్టి నింపి మొక్కలు పెంచాల్సి ఉంది కానీ 47 వేల బ్యాగులలో కనీసం మట్టి కూడ నింపకపోవడం పట్ల ఏపీఓ నిర్లక్ష్యంగా పరిగణించి సస్పెండ్‌ చేశారు. కామునిపల్లి, పీరంపల్లి, లింగంపల్లి, ఇప్పాయిపల్లి, కుస్మసముద్రం, తిర్మలాపూర్‌ గ్రామాలలో నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంపై అధికారులు చర్యలు తీసుకున్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

తాండూరు టౌన్‌: ఎనిమిది మంది పేకాటరాయుళ్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ సంతోశ్‌కుమార్‌ తెలిపిన ప్రకారం.. మంగళవారం సాయిపూర్‌లోని ఓ ఇంట్లో పేకాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు ఇంటిపై దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పేక ముక్కలతో రూ.15,160 నగదును స్వాధీనం చేసుకున్నా రు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడి

తాండూరు టౌన్‌: బెల్టు షాపుపై దాడి చేసి ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ సంతోశ్‌ తెలిపిన ప్రకారం.. మంగళవారం మండల పరిధి అంతారం లోని కుర్వ చెన్నప్ప కిరాణ దుకాణంలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు రాత్రి పోలీసులు షాపుపై దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

కొత్తూరు: ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని కొడిచర్ల తండాలో మంగళవారం వెలుగుచూసింది. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. మండలంలోని కొడిచర్లతండాకు చెందిన సభావట్‌కుమార్‌, శారద(24) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. కాగా ఈ నెల 3న శారద తన భర్తకు ఫోన్‌చేసి తాను పిల్లలను ఇంట్లోనే వదిలేసి వెళ్తున్నాని చెప్పి ఫోన్‌ స్విచ్చాఫ్‌ చేసింది. శారద ఇంట్లో లేకపోవడంతో పలు చోట్ల వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. భర్త కుమార్‌ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

‘పది’కి ప్రత్యేక తరగతులు

ప్రతీ విద్యార్థిపై దృష్టి

- ఉత్తమ జీపీఏల సాధనే లక్ష్యం
- ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు


గ్రూపు డిస్కషన్‌ చేస్తున్న ఎంఈఓ హరిశ్చందర్‌


డిజిటల్‌ మాధ్యమంలో బోధన

పూడూరు: పదో తరగతి వార్షిక ఫలితాల్లో మండలంలో ఎక్కువ ఉత్తమ గ్రేడ్‌లు, జీపీఏలు సాధించేందుకు మండల విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉత్తీర్ణత శాతం పెంచే ఆలోచనతో విద్యాశాఖ ఆదేశాలతో మండల పరిధిలోని పదో తరగతి విద్యార్థులను పరీక్షల దిశగా సన్నద్ధం చేస్తున్నారు. మండల పరిధిలోని పది జెడ్పీహెచ్‌ఎస్‌లు, మోడల్‌ స్కూల్స్‌, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన 653 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. పదో తరగతి ఫలితాల్లో నంబర్‌ వన్‌ స్థానంలో ఉండాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మండల పరిధిలోని పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా బోధిస్తున్నారు. విద్యార్థులను గ్రూపుగా విభజించి పాఠ్యాంశాలను రివిజన్‌ చేయిస్తున్నారు. మార్చి నెలాఖరు వరకు ప్రత్యేక తరగతులను కొనసాగిస్తామని చెప్పారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం తరగతులు తీసుకుంటున్నామని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు. సబ్జెక్టుల్లో పట్టు వచ్చేంత వరకు విద్యార్థులపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. నెలలో నాలుగుమార్లు యూనిట్‌ టెస్టులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతీ రోజు నోట్స్‌ రాయడంతో పాటు డిజిటల్‌ తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులు కనీసం ఉత్తీర్ణత సాధించేలా సాధన చేయిస్తున్నారు.

ఉత్తమ జీపీఏ సాధనకు..

ప్రతి రోజు ఒక సబ్జెక్టుపై స్లిప్‌ టెస్టు నిర్వహిస్తున్నాం. పదవ తరగతి విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నాం. ప్రతీ సబ్జెక్టులో ఉత్తమ మార్కులు సాధించేలా విద్యార్థులను తయారుచేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులకు పట్టుసాధించే వరకు తరగతులను తీసుకుంటున్నాం. – కృష్ణ, హెచ్‌ఎం, కదుమూరు

పట్టు వచ్చేంత వరకు..



సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఆయా సబ్జెక్టుల్లో పట్టు వచ్చేంత వరకు బోధన సాగిస్తున్నాం. గతేడాది ఫలితాల కంటే ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో మంచి మార్కులు వచ్చేలా పాఠ్యాంశాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– హరిశ్చందర్‌, ఎంఈఓ, పూడూరు

మార్కులకు దోహదం



పాఠ్యాంశాల్లో అర్థంకాని విషయాలను అడిగి తెల్సుకుంటున్నాం. ప్రత్యేక తరగతులు పెట్టడంతో తాము మరిచిపోయిన అంశాలను తిరిగి గుర్తు చేస్తున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల మాకు మార్కులు సాధించేందుకు దోహదపడుతాయి. తమకు పాఠ్యాంశం అర్థం అయ్యేలా బోధిస్తున్నారు.

– గీతిక, విద్యార్థిని, పదవ తరగతి

టెస్టులతో పునఃశ్చరణ



పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ జీపీఏ గ్రేడ్‌ను సాధిస్తా. ప్రత్యేక తరగతులు తీసుకోవడం మా అదృష్టం. చదువుతో పాటు టెస్టులు పెడుతుండటంతో పాఠ్యాంశాలను నెమరు వేసుకుంటున్నాం. వెనుకబడిన సబ్జెక్టులను అర్థమయ్యేలా భోదిస్తున్నారు. మంచి మార్కులు సాధించేందుకు ప్రత్యేక తరగతులు ఉపయోగపడతాయి.

– సాత్విక్‌గౌడ్‌, విద్యార్థి, పదవతరగతి

‘క్రిడా’టెక్నాలజీతో సుస్థిర దిగుబడులు

- వ్యవసాయానికి సాంకేతికత జోడించాలి
- పరిగి ఎమ్మెల్యే డాక్టర్‌ రామ్మోహన్‌రెడ్డి



కిసాన్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: వ్యవసాయంలో సుస్థిర దిగుబడులు సాధించాలంటే క్రిడా (సెంట్రల్‌ రీసెర్చ్‌ ఇనిస్టిట్యూట్‌ ఫర్‌ డ్రైల్యాండ్‌ అగ్రికల్చర్‌) సంస్థ టెక్నాలజీని పాటించాలని పరిగి ఎమ్మెల్యే డాక్టర్‌ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ హైదరాబాద్‌, ఫార్మర్‌ ఫస్ట్‌ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కిసాన్‌ మేళా ఏర్పాటు చేశారు. క్రిడా సంస్థ దత్తత తీసుకున్న గొంగుపల్లి, రాకంచర్ల, దేవనోనిగుడ, పుడుగుర్తి, మేడికొండ, బాకాపూర్‌ గ్రామాల రైతులు పాల్గొన్నారు. కిసాన్‌ మేళాలో ఎమ్మెల్యే పలు స్టాల్స్‌ను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తూ ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సహజవనరుల సంరక్షణ, నూతన వంగడాలు, నూతన వ్యవసాయ పద్ధతులు , కాలానికి అనుగుణంగా నూతన పద్ధతులు అవలంబించుకోవాలని సూచించారు. మండల పరిధిలోని పూర్తి గ్రామాలను దత్తత తీసుకుని ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించాలని క్రిడా శాస్త్రవేత్తలను కోరారు. శాస్త్రవేత్తలు డాక్టర్‌ నిర్మల, డాక్టర్‌ బోయిని నర్సింలు మాట్లాడుతూ.. ప్రతికూలవాతావరణ పరిస్థితుల్లోనూ లాభసాటి దిగుబడిరావడానికి ఫాంపాండ్‌ టెక్నాలజీని వాడాలని తెలిపారు. ఉద్యాన పంటలకు పరిగి ప్రాంత వాతావరణం అనుకూలంగా ఉంటుందన్నారు. తోటలు, కూరగాయల సాగును పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ పట్లోళ్ల సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సల్మాతాజోద్దీన్‌, డీసీసీ ఉపాధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌, పెంటయ్య, డీసీసీ కార్యదర్శి అజీంపటేల్‌, షకీల్‌, మండల ప్రత్యేక అధికారి సుధారాణి, క్రిడా శాస్త్రవేత్తలు బి.సంజీవ రెడ్డి, డాక్టర్‌ ఎ.గోపాల్‌రెడ్డి, డాక్టర్‌ అన్షిదాబీబి, డాక్టర్‌ జాగృతిరోహిత్‌, ఇఫ్కో అధికారులు చంద్రన్న, లైన్‌ డిపార్ట్‌మెంట్‌ అధికారులు అనిల్‌ కుమార్‌, చక్రపాణి, రమాదేవి, తహసీల్దార్‌ రమాదేవి, ఏఓ తులసీరాం, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్‌ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థికి సర్టిఫికెట్‌ అందజేస్తున్న హెచ్‌ఎం

కేశంపేట: సబ్‌ జూనియర్‌ అథ్లెటిక్‌ మీట్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో జిల్లా స్థాయిలో మండలంలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మెరిశారు. 7వ తరగతి చదువుతున్న స్పందన, సుప్రియలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌ తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో తైక్వాండో పోటీలను నిర్వహించారు. అందులో పాఠశాలకు చెందిన మహిపాల్‌ ఉత్తమ ప్రతిభను కనబరిచి బ్లాక్‌ బెల్టును సాధించారు. ఈ మేరకు విద్యార్థికి ఢిల్లీ నుంచి సర్టిఫికెట్లు రావడంతో హెచ్‌ఎం అందించారు. ఉత్తమ ప్రతిభ చూపడం పట్ల మండల విద్యాధికారి మనోహర్‌, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాససాగర్‌ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిప్రసాద్‌, అబ్దుల్‌భారీ, శిరీష, సుజాత, తైక్వాండో మాస్టర్‌ నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

వంతెన.. ఇదేం చింత!


సీసీ రోడ్డు వేయక అసంపూర్తిగా నిలిచిన వంతెన

- పనులు పూర్తికాక స్థానికుల అవస్థలు
- సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రజల ఎదురుచూపులు

ధారూరు: ముగ్గురు కాంట్రాక్టర్లు మారిన ఆ వంతెన పనులు అసంపూర్తిగానే మిగిలాయి. మండల పరిధిలోని స్టేషన్‌ ధారూరు–దోర్నాల్‌ గ్రామాల మధ్యలో కాగ్నానదిపై ఉన్న పాత వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో కొత్త వంతెన నిర్మాణానికి 2017లో రూ.4.62 కోట్లు మంజూరు చేశారు. వెంటనే ఈ వంతెన పనులు ప్రారంభమైనా పలు కారణాలతో ఇద్దరు కాంట్రాక్టర్లు అసంపూర్తిగా వదిలేశారు. మూడో కాంట్రాక్టర్‌ పనులు ముమ్మరం చేసి రూ.1.60 కోట్ల పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు పూర్తి చేయాలంటే చేసిన పనులకు బిల్లు ఇవ్వాలని కాంట్రాక్టర్‌ కోరారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు బిల్లు చేసి ఈఎన్‌సీకి పంపారు. బిల్లు రాకపోవడంతో పనుల్లో జాప్యం కొనసాగుతోంది. గత నవంబర్‌లో ఇద్దరు కాంట్రాక్టర్లు నిర్మించిన పిల్లర్లపై కొత్త కాంట్రాక్టర్‌ గట్టర్లు ఎక్కించారు. త్వరలో పైన సీసీ రోడ్డు వేసి రాకపోకలకు అనువుగా మారుతుందనే సంతోషం ప్రజల్లో వ్యక్తం అయింది. డిసెంబర్‌ నుంచి మిగిలిన పనులు నిలిచిపోవడంతో మళ్లీ అనుమానాలు తలెత్తుతున్నాయి.

రూ.2.70 కోట్ల ప్రతిపాదనలు

పిల్లర్లపై గట్టర్లు వేసి పైన స్లాబ్‌ వేయడానికి ముందే చేసిన పనులకు బిల్లుకు ఎంబీ రికార్డు చేసి పంపించారు. స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ ప్రత్యేక చొరవతో వంతెన ఇరువైపులా రోడ్డు నిర్మాణానికి మరో రూ.2.70 కోట్లు ప్రతిపాదనలు పంపించారు. స్పీకర్‌ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పనులకు తొందరగా జరుగుతాయని తాండూరు ఆర్‌ అండ్‌ బీ ఏఈ శ్రావణ్‌కుమార్‌ తెలిపారు. ప్రస్తుతం వంతెనకు ఇరువైపులా మట్టి వేసే పనుల కోసం కాంట్రాక్టర్‌ ప్రయత్నిస్తున్నారని, పనులెక్కడ ఆగిపోలేవని ఆయన వివరించారు. వంతెన పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌ రోడ్డు పనులను సైతం చేస్తారని వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


పెద్దేముల్‌: లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్‌/యాలాల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యాలాల మండలానికి చెందిన 57 మంది కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్‌ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి తీరుతామన్నారు. ఆరు గ్యారంటీల స్కీం ఫలాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి దక్కేలా చూస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్‌ సురేందర్‌రెడ్డి, బీ బ్లాక్‌ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వీరేశం, భీమప్ప, నాయకులు హన్మంతు, దేవగారి రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

భద్రప్ప ఆలయ అభివృద్ధికి కృషి

తాండూరు పట్టణంలోని శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి (భద్రప్పగుడి) ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వీరశైవ సమాజ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. అభివృద్ధి పనులపై ఒక నివేదిక సమర్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు డాక్టర్‌ సంపత్‌ కుమార్‌, మురళీ కృష్ణ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రత్యేక నిధులు

పెద్దేముల్‌: మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు షాదీ ముబారక్‌, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గెలిపించిన పెద్దేముల్‌ ప్రజలకు, కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తానని మరో సారి గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తానన్నారు. జిల్లాలో వెనుకబడిన పెద్దేముల్‌ మండలానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకువస్తానన్నారు. గత ప్రభుత్వం దళిత బంధు, మూడు ఎకరాల భూమి, నిరుపేదలకు ఇండ్ల పేరిట మోసం చేసిందని ఆరోపించారు. మార్చిలో అసెంబ్లీ సమావేశాలు పూర్తయిన వెంటనే ఉచిత విద్యుత్‌, రూ.500కే వంట గ్యాస్‌ తదితరాలు అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎంపీపీ అనురాధ మాట్లాడుతూ.. గతంలో బ్లాక్‌ లిస్ట్‌లో పెట్టిన అర్హులకు సైతం కల్యాణ లక్ష్మి చెక్కులను వీలైనంత త్వరగా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్‌, వైస్‌ ఎంపీపీ మధులత, తహసీల్దార్‌ కిషన్‌, కోటపల్లి వ్యవసాయ మార్కెట్‌ కమిటి చైర్‌ పర్సన్‌ మాణెమ్మ, మాజీ చైర్మన్‌ బుజ్జమ్మ, ఎంపీటీసీ సభ్యులు నీలు, శంకర్‌, నియోజక వర్గ ఏ–బ్లాక్‌ అధ్యక్షుడు నర్సింలు, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌, మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, తాండూరు మార్కెట్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ జితేందర్‌రెడ్డి, మండల కో–ఆప్షన్‌ సభ్యుడు నజీర్‌, జిల్లా మహిళ అధ్యక్షురాలు శోభారాణి, నాయకులు మైపాల్‌రెడ్డి ,ఎల్లారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌, లాల్‌రెడ్డి, షబీర్‌, పలు గ్రామాల నాయకులు తదితరులు పాల్గలొన్నారు.

‘నెక్‌’ ఎన్నికలు వాయిదా

షెడ్‌ అద్దెకు తీసుకున్న రైతులకు ఓటు హక్కు కల్పించడంపై పౌల్ట్రీ యజమానులు అభ్యంతరం


అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న పౌల్ట్రీ రైతులు

షాద్‌నగర్‌: పౌల్ట్రీ రైతుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో షాద్‌నగర్‌లో నేషనల్‌ ఎగ్‌ కోఆర్డినేషన్‌ (నెక్‌) ఎన్నికలు వాయిదా పడ్డాయి. నెక్‌ సీఈఓ విజిల్‌ కుమార్‌ ఆదేశాల మేరకు మంగళవారం షాద్‌నగర్‌ నెక్‌ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు పట్టణంలోని కేకేఆర్‌ కన్వెన్షన్‌ హాల్‌లో ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్లు స్వీకరించి విత్‌డ్రా చేసుకునేందుకు సమాయాన్ని కేటాయించారు. ఓ వర్గానికి చెందిన పలువురు రైతులు ఓటరు జాబితా పై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఓటరు జాబితాలో పౌల్ట్రీ షెడ్‌ యజమానులకు కాకుండా అద్దెకు తీసుకున్న రైతులకు ఓటు హక్కు కల్పించడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కేవలం పౌల్ట్రీ షెడ్‌ యజమానులకు మాత్రమే ఓటు హక్కు కల్పించాలని డిమాండ్‌ చేస్తూ ఎన్నికలు నిర్వహించేందుకు వచ్చిన వారితో వాగ్వాదానికి దిగారు. షెడ్‌లను అద్దెకు తీసుకున్న రైతులకు ఓటు హక్కు కల్పించాలని మరో వర్గం రైతులు డిమాండ్‌ చేశారు. నెక్‌ అధికారులు ఒక వర్గం వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని కొందరు రైతులు ఆరోపించారు. ఓటరు జాబితా రూపొందించాక అద్దె రైతులు అని షరతులు విధించడం సరికాదని మరి కొందరు రైతులు వాపోయారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకొని ఉద్రిక్తతకు దారి తీసింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకొని ఇరు వర్గాల వారికి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలని సూచించారు. రైతుల అభ్యంతరాల నేపథ్యంలో నెక్‌ ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు సీఈఓ విజిల్‌కుమార్‌ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నెక్‌ ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారి నారాయణరావు ప్రకటించారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం

ఇబ్రహీంపట్నం రూరల్‌: విద్యార్థి దశ నుంచే ఓటు హక్కుపై అవగాహన అవసరమని వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్‌ గణేశ్‌ అన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ కార్యాలయంలో సిస్టమ్‌ ఓటర్స్‌ ఎడ్యుకేషన్‌ ఎలక్ట్రోల్‌ పార్టిసిపేషన్‌ పై విద్యార్థులకు అవగహన సదస్సు నిర్వహించారు. ఈవీఎంల పనితీరు, పోలింగ్‌ స్టేషన్ల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా గణేశ్‌ మాట్లాడుతూ... విద్యార్థులు ఓటు హక్కు వినియోగం , విలువలపై అవగహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొంగరకలాన్‌ శ్రీనివాస స్కూల్‌ డైరెక్టర్‌ లక్కరాజు రాధిక, చైర్మన్‌ లక్కరాజు శ్రీనివాస్‌రావు, నోడల్‌ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విక్రయాల్లో అవకతవకలు సహించం

సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజారత్నం


రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ రాజారత్నం

కొందుర్గు: ఎరువుల విక్రయాల్లో డీలర్లు అవకతవకలకు పాల్పడితే సహించేదిలేదని షాద్‌నగర్‌ వ్యవసాయ సహాయ సంచాలకులు రాజారత్నం పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం చౌదరిగూడ మండలంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేసి, స్టాకు బుక్కులు, బిల్లుల పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కాలం చెల్లిన విత్తనాలు, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విధిగా బిల్లులు తీసుకోవాలని, కాలపరిమితి, లాట్‌ నంబర్‌ సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు.

సొండెపూర్‌తండాలో చోరీ

నాలుగు తులాల బంగారం, 45 తులాల వెండి ఆభరణాల అపహరణ

పరిగి: మేకలను మేతకు తీసుకెళ్లి వచ్చే వరకు ఓ వ్యక్తి ఇల్లు గుల్లయింది. ఈ సంఘటన మండల పరిధిలోని సొండేపూర్‌తండాలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన హిర్యానాయక్‌ ఇంటికి తాళం వేసి మేకలను పొలం దగ్గర మేతకోసం కట్టివేసేందుకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు వచ్చి ఇంటి ప్రహరీ దూకి ఇంట్లోని 4 తులాల బంగారం , 45 తులాల వెండి ఆభరణాలు దొంగిలించుకు వెళ్లారు. హిర్యానాయక్‌ ఇంటికి వచ్చే సమయంలోనే దుండగులు ఇంటి నుంచి బయటకు వస్తున్నారు. దీంతో ఎవరు మీరు.. ఇంట్లోకి ఎందుకు వెళ్లారు అని ప్రశ్నించగా.. ఇంటి నంబర్‌ వేసేందుకు వచ్చామని చెప్పి పరారయ్యారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.


కేసీఆర్‌ నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యేలు సబితారెడ్డి, సుధీర్‌రెడ్డి, కేపీ వివేకానంద, మాగంటి, మల్లారెడ్డి, ప్రకాశ్‌గౌడ్‌, ఎమ్మెల్సీలు శంభీపూర్‌ రాజు, పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్‌, పైలెట్‌ రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి తదితరులు